క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో స్వాతి వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శ్రీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనం నిర్వహించి అనంతరం పట్టువస్త్రాలతో స్వామి వారికి అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మహా మంగళ హారతులు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో దేవాలయం ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో మధుసూదన్, రామ్మూర్తి పాల్గొన్నారు.

అష్టాదళ పాద పద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారిని మంగళగౌరి అలంకారంలో అలంకరించి అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం కార్యక్రమాన్ని సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం: ప్రస్తుత సీజన్లో వస్తున్న జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రుద్రవరం ప్రభుత్వ వైద్యాధికారి ప్రసాద్ సూచించారు. మంగళవారం పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జ్వరాలతో బాధపడుతూ ప్రజలు ఎక్కువగా ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారన్నారు. జ్వరాలు ఎక్కువగా ప్రబలకముందే ముందు జాగ్రత్తగా గ్రామాల్లోని ఆయా కాలనీల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో జ్వరాలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారమన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రజకుల జోలికి వస్తే సహించం

నంద్యాల(అర్బన్): రజకుల జోలికి వస్తే సహించేది లేదని ఏపీ రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి హెచ్చరించారు. స్థానిక విశ్వనగర్‌లోని సంఘం కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పురాణాల పేరుతో రజకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడితే సహించమన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసనలో ఓ ఐటీ ఉద్యోగిని చాకలి వెధవలంటూ వ్యాఖ్యానించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, రాము, రంగనాయులు, హనుమంతు, నాగేషు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా వ్యాప్తంగా నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో వినూత్న నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ధనుంజయుడు, శ్రీనివాసులు, హరినాథ్, సామేలు తదితరులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(సిటీ): పట్టణంలోని 37వ వార్డు నందమూరినగర్‌లో నివాసం ఉంటున్న బోయ అంజనమ్మ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతురాలు వైఎస్సార్‌బీమా అర్హురాలు కావడంతో నామినీగా ఉన్న బోయ నాగలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలను వార్డు అడ్మిన్ వెంకట సుధాకర్, వెల్ఫేర్ సెక్రటరీ జయరాం నాయక్, వలంటీర్ పర్వీన్ మంగళవారం సాయంత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆళ్లగడ్డ : పట్టణంలో మోటర్ సైకిల్, కారు ఢీకొన్న ప్రమాదంలో పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని దొమ్మరి కాలనీకి చెందిన శివరాం (18) మోటర్‌సైకిల్‌పై నంద్యాల వైపు నుంచి వస్తుండగా కొత్త మార్కెట్ యార్డ్ సమీపంలో సందులో నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివరంను నంద్యాల వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేష్ బాబు తెలిపారు.



దోన్‌లో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి





ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

హంద్రీ – నీవా ద్వారా ఉమ్మడి జిల్లాలోని 77 చెరువులకు నీటిని అందించే పథకాన్ని ప్రారంభించేందుకు మంగళవారం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.






ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి , మైనార్టీ సలహాదారు హబీబుల్లా , జలవనరుల సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

మెస్ చార్జీలు పెంచాలని సీఎంకు వినతి



ముఖ్యమంత్రిని కలిసిన సాయిరాంరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు, డైట్ చార్జీలను పెంచాలని కోరుతూ మంగళవారం డోన్‌కు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఉమ్మడి కర్నూలు జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నంద్యాల ఎమ్మెల్యే సహకారంతో నంద్యాల నియోజకవర్గంలో మెడికల్ కాలేజీ, ఐటీఐ కళాశాల, మోడల్ స్కూల్, ఉర్దూ కళాశాలలో మౌలిక వసతుల కల్పన, పౌష్టికాహారం కల్పించినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గోస్పాడు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు దీబగుంట్ల హైస్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్‌ఎం నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఉమ్మడి కర్నూలు జిల్లా ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీలు ఈ నెల 16న నంద్యాల కేఎస్‌ఎం మున్సిపల్ హై స్కూల్‌లో జరిగాయన్నారు. ఇందులో అండర్ 14 బాలికల విభాగంలో గీత మాధురి, అండర్ 17 బాలుర విభాగంలో వెంకట అంజి కుమార్, అబ్దుల్ రాజా హుసేన్, సంజీవ, సంతోష్, అండర్-17 బాలికల విభాగములో జాహ్నవి, అయేషా, స్టాండ్‌బైగా నాగ గణేష్ ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు ఈ నెల 21 నుంచి 23 వరకు విజయవాడలో జరగనున్నాయని తెలిపారు. విద్యార్థులను, పీడీ విశ్వనాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బయ్య, వెంకటలక్ష్మమ్మ, ఉమామహేశ్వరి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సనాతన సంప్రదాయాలను గౌరవిద్దాం

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మం, సంప్రదాయాలను గౌరవించాలని మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన కోదండ రామాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం బాల వికాస్ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బాలల భగవద్గీత, భాగవతం పద్యాలపన ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో గ్రామపెద్దలు ప్రతాప్, సర్పంచ్ రమేష్, సమరసత సేవా సభ్యులు సంజన్న, నాగార్జునరెడ్డి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి నంద్యాలలో చికిత్స పొందుతున్న షేక్‌గఫ్బాల్ బాషా (45) కోలుకోలేక మృతి చెందాడని ఎస్‌ఐ సురేష్ మంగళవారం తెలిపారు. గత నెల 30న కర్నూలు- కడప జాతీయ రహదారిపై మోటార్ సైకిల్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మగ్బూల్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17 రాత్రి మృతి చెందాడు. మృతుని ది గోస్పాడు మండలం కానాలపల్లె, కూలి పనులు చేస్తు జీవనం సాగించేవాడు, ఇతనికి ఇద్దరు కుమారులున్నాయి.

పట్టణ సుందరీకరణకు చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణ సుందరీకరణలో భాగంగా పలు మొక్కలు రోడ్డుకు ఇరువైపులా, డివైడర్ మధ్యలో నాటి వాటి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై స్థానిక కార్యాలయంలో మంగళవారం పలు శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 3 నుంచి పట్టణంలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు. శానిటేషన్ విభాగంలో పురోగతి సాధించి ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాల్వల్లో చెత్త వేయకుండా దుకాణదారులకు పలు సూచనలు చేయాలని చెప్పారు. అక్రమ కట్టడాలను నిర్మాణ దశకు ముందే ఆపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, డీఈఈలు మధు కుమార్, జయభారత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

నంద్యాల(వ్యవసాయం): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అన్నెం శ్రీనివాస రెడ్డిని నంది రైతు సమాఖ్య నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య గౌరవ సలహాదారులు విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యా బోధనతో పాటు సమాజాన్ని చైతన్యపరిచే శక్తి ఉపాధ్యాయులకు ఉందన్నారు. శ్రీనివాసరెడ్డి నంద్యాల పట్టణంలో పలు సాహిత్య, సేవా కార్యక్రమాల్లో పాల్గొని ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకోవడం అభినందనీయమన్నారు. సమాఖ్య ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త రామారెడ్డి, రైతు సంఘ సభ్యులు కొండా మోహన్ రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం.. అంగన్‌వాడీ కేంద్రానికి తాళం



ఓజి తాండాలో కార్యకర్త రాకపోవడంతో చిన్నారులను ఆడిస్తున్న ఆయా



చిన్నవంగలి గ్రామంలో 1వ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉన్న దృశ్యం

చాగలమర్రి: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు నిరుగారుస్తున్నారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలపై మంగళవారం సాక్షి విజిట్ నిర్వహించింది. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మంగళవారం 1వ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఉంది. అలాగే ఓజీ తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి గత రెండు రోజులుగా కార్యకర్త విధులకు హాజరుకాకపోగా, సూపర్‌వైజర్ సుశీలమ్మకు సమాచారం కూడా ఇవ్వకపోవడం గమనార్హం. అంతే కాకుండా చక్రవర్తులపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా సెలవుపై వెళ్లడంతో కార్యకర్త విద్యార్థులకు అన్నం వండలేదు. పైగా ఆయా సెలవు పెట్టడంతో వేరే వాళ్ల ఇంట్లో వంట చేయిస్తున్నామనడం హాస్యాస్పదం. డి.కొత్తపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఒకే ఒక విద్యార్థిని, ముత్యాలపాడు-3 కేంద్రంలో కార్యకర్త సెలవుపై వెళ్లడంతో ఆయాతో పాటు ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నారు. సూపర్‌వైజర్ సుశీలమ్మ సోమవారం సెలవులో ఉన్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ సీడీపీఓ విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న కార్యకర్తలపై చర్యలు చేపట్టి కార్యకర్తలు సక్రమంగా విధులకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’ను విజయవంతం చేయండి



36వ వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన 36వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరికీ పరిపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి సిబ్బంది ఉన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

శిరివెళ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతుంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, రక్త హీనతపై సర్వే చేస్తున్నారు. జ్వరం తీవ్రతను బట్టి మలేరియా, డెంగీ పరీక్షలు కూడా చేస్తున్నారు. శిరివెళ్ల పీహెచ్‌సీ పరిధిలోని 2వ సచివాలయం, యర్రగుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో సర్వే జరుగుతుంది. సచివాలయ పరిధిలో 1,243 ఇళ్లు ఉండంగా ఇప్పటికి వరకు 25 శాతం సర్వే పూర్తి యిందని డాక్టర్లు తెలిపారు.

ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ

చాగలమర్రి: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని స్థానిక ప్రభుత్వ వైద్యులు షేక్. ఇమ్రాన్ అన్నారు. చాగలమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల పరిధిలో ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలు ప్రతి సబ్ సెంటర్‌లో సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి అవసరమైన టోకన్లను ఏఎన్‌ఎం, సీహెచ్‌ఓలకు అందజేశారు. మంగళవారం మండలంలోని మల్లెవేముల, మద్దూరు గ్రామాలలో సర్వే ప్రారంభిచారు. వైద్యురాలు తాహెరా సుల్తానా పాల్గొన్నారు.

3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ఉయ్యాలవాడ : ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు మండలంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3న అల్లూరు గ్రామ సచివాలయం, 4న బోడెమ్మనూరు, 5న ఇంజేడు, 7న ఆర్.జంబులదిన్నె, 10న సుద్దమల్ల, 17న హరివరం, 19న కొండుపల్లె, 21న తుడుమలదిన్నె గ్రామ సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాల్లో ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు స్పెషలిస్టులు వైద్య సేవలు అందిస్తారన్నారు.








బాలాజీ కాంప్లెక్స్‌లో గరుడ వాహన మహాగణపతి, బైర్మల్ వీధి ఆంధ్రా బ్యాంక్ వద్ద మహావిఘ్నేశ్వరుడు, కానాలలో వినాయక విగ్రహం, రెవెన్యూ క్వార్టర్స్‌లో వరసిద్ధి వినాయకుడు,జిల్లెల్లలో చిన్నారులు తయారు చేసిన మట్టి వినాయక విగ్రహం, గోస్పాడులో ప్రతిష్ఠించిన వినాయకుడు

వినాయకా.. నమోస్తుతే

- వాడవాడలా కొలువుదీరిన వినాయక విగ్రహాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు



ఇక్షుదండ మహాగణపతికి పూజలు నిర్వహిస్తున్న ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితిని సోమవారం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే పుణ్యస్నానాలు నిర్వహించుకొని ఇళ్లలో వినాయకుల విగ్రహాలను పూజించి పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. వినాయక వ్రత నియమాలను పాటిస్తూ వ్రత కథను చదివారు. వాడవాడల్లో గణనాథుడు కొలువుదీరాయి. గణేష్ ఉత్సవాలు పట్టణంలో విద్యుద్దీపాలంకరణలతో కనుల పండువగా జరుగుతున్నాయి.

• స్థానిక సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన ఇక్షుదండ మహాగణపతిని ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి సందర్శించి ఉత్సవాలను ప్రారంభించారు. ఆయనకు భగవత్ సేవా సమాజ్ సభ్యులు స్వాగతం పలికారు. తర్వాత ఆయన స్వామి వారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ బెంగళూరు నుంచి చెరుకు గడలను తీసుకొని వచ్చి ఇక్షుదండ మహాగణపతి ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కల్లూరి రామలింగారెడ్డి, డాక్టర్ రవికృష్ణ, సాయిరాంబాబా, రామకృష్ణ డిగ్రీ కళాశాల అధినేత రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల గ్రామాల్లో సోమవారం గణనాథులు కొలువయ్యారు. భక్తిశ్రద్ధలతో గణనాథులను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మూడవ రోజు బుధవారం విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల ప్రజలు ఏర్పాటు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ప్రత్యేకంగా మండపాలను ఉంచి రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. మంగళవారం వినాయక విగ్రహాల వద్ద నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆళ్లగడ్డ : నియోజకవర్గంలో వినాయక చవితి పండగ వేడుకలను పురస్కరించుకుని భక్తులు బొజ్జ గణపయ్య విగ్రహాలను కొలువుంచి ప్రత్యేక పూజులు నిర్వహించారు. ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వాహకులు మండపాలను సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసి అందులో గణనాథుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.




శిరివెళ్లలో పూజలందుకుంటున్న వినాయకుడు, అహోబిలంలో కొలువైన వినాయకుడు




ఉయ్యాలవాడలో పూజలందుకుంటున్న వినాయకుడు, దొర్నిపాడులో కొలువైన వినాయకుడు

శిరివెళ్ల: మండల కేంద్రంలో 16, యర్రగుంట్ల 19, గోవిందపల్లె 18, కోటపాడు 2, గుంప్రమాన్‌దిన్నె పంచాయతీలో 8, జీనేపల్లె 4, చెన్నూరు,బోయలకుంట్ల మహదేవపురంలో 5 విగ్రహాల ఏర్పాటు చేశారు.

ఉయ్యాలవాడ : మండలంలోని వివి గ్రామాల్లో 52 చోట్ల కొలువుదీరిన గణనాథులకు వినాయక చవితి పండుగ పురస్కరించుకుని సోమ, మంగళవారం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలో వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండపాల్లో కొలువైన లంబోదరులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. చిన్నారులు మండలపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.